అత్యాచారం కేసులో నిందితునికి జీవిత ఖైదు 6లో
ఎస్టీ, ఎస్సీలను కేసుల్లో ఇరికిస్తే సహించేది లేదు 7లో
రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

అమ్మో.. జ్వరం

చికున్‌గున్యా, డెంగీ లక్షణాలతో ఆస్పత్రులకు క్యూ



- ఒళ్లు, కీళ్ల నొప్పులతో మంచం పడుతున్న జనం
- ఒక్క కేసూ లేదంటున్న ఆరోగ్యశాఖ
- ముంచుకొస్తున్న 'డెంగీ' డేంజర్
- ఈ సీజన్‌లో 220 కేసులు నమోదు
- మొక్కుబడిగా సాగుతున్న జ్వర సర్వే



సంగారెడ్డి జీజీహెచ్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ వద్ద రద్దీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30: జిల్లా ప్రజలను జ్వరాలు పీడిస్తున్నాయి. జలుబు, దగ్గు, కీళ్ల, ఒళ్లునొప్పులు, తలనొప్పితో సతమతమవుతున్నారు. జ్వర బాధితులు లేని ఇల్లే లేదంటే అతిశయోక్తి కాదు. వాతావరణంలో మార్పులకు తోడు పారిశుధ్య నిర్వహణ లోపాలతో జనాలు ఆస్పత్రుల పాలవుతున్నారు. జ్వరం, నొప్పులు సాధారణంగా చికున్‌గున్యా లక్షణాలు. దోమల ద్వారా ఇది వ్యాపిస్తుంది. దీంతో జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, దురద తదితర లక్షణాలతో ప్రజలు బాధపడుతున్నారు. ఈ లక్షణాలతోనే అధికసంఖ్యలో బాధితులు ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. కానీ, చికున్‌గున్యా నిర్ధారణ పరీక్షలు చేస్తే ఫలితం నెగిటివ్ వస్తున్నదని వారు తెలిపారు. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వెయ్యి మందికి చికున్‌గున్యా నిర్ధారణ పరీక్షలు చేయగా.. ఒక్కరికి కూడా పాజిటివ్ రాలేదని వైద్యాధికారులు పేర్కొనడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

ఇంటికొకరు చొప్పున..

జిల్లాలో డెంగీ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 220 కేసులు నమోదయ్యాయి. దీనికితోడు వైరల్ ఫీవర్స్ వెంటాడుతున్నాయి. ఏ ఇంటిని తట్టినా.. ఓ జ్వర బాధితుడు ఉంటున్నారు. ఫలితంగా చికిత్స కోసం బాధితులు ఆస్పత్రులకు వరుస కడుతున్నారు. జిల్లాలోని పటాన్‌చెరు, జోగిపేట-అందోల్, సంగారెడ్డి ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 3,756 మందికి డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయగా, 220 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా ఈ సంఖ్య ఎక్కువగా ఉండవచ్చని తెలుస్తోంది. ఇక టైఫాయిడ్ కేసులు గత జూన్ నెలలో 118, జూలైలో 125, ఆగస్టులో 132 కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు.

పేరుకే జ్వర సర్వే..

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న ఇంటింటి జ్వర సర్వే మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రభుత్వం జ్వర సర్వేకు ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో మెప్మా, మున్సిపల్, ఆరోగ్యశాఖ సిబ్బంది కలిసి జ్వర సర్వే నిర్వహిస్తున్నారు. కానీ జ్వర బాధితులు ఉన్నారా అని అడగకుండానే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంట్లో ఎంత మంది ఉంటున్నారని మాత్రమే అడుగుతున్నారని, ఎవరికైనా జ్వరం వచ్చిందా అనే విషయమే అడగడం లేదని సంగారెడ్డిలోని రామ్‌నగర్‌కు చెందిన ఓ ఇంటి యజమాని చెప్పడం గమనార్హం. రోజుకు ఇన్ని ఇళ్లను సర్వే చేశామని గొప్పగా సంఖ్య కోసమే సర్వే నిర్వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

డెంగీ పేరిట ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

జ్వరం వచ్చిందంటే చాలు.. డెంగీ అనే భయంతో జనాలు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేటు దవాఖానాలు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, వెంటనే ఎక్కించాలంటూ కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు హడావుడిచేసి వేలాది రూపాయలు దండుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సీజనల్‌గా వచ్చే వైరల్ ఫీవర్స్‌ను కూడా డెంగీ జ్వరంగా చెపుతూ అడ్మిట్ చేసుకుని.. ఒక్కో రోగి నుంచి ఆస్పత్రి చార్జీలు, ల్యాబ్, మందులు అంటూ డిశ్చార్జి అయ్యేవరకు రూ.లక్ష బిల్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలీసా పరీక్ష ద్వారానే డెంగీని నిర్ధారణ చేయాలి. కానీ, చాలా ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ కిట్ పేరిట తూతూమంత్రంగా పరీక్షలు జరిపి పాజిటివ్ వచ్చిందని, వెంటనే అడ్మిట్ అవ్వాలని హడావుడి చేయడంతో బాధితులు భయాందోళనకు గురవుతున్నారు. డెంగీ బెంగ వెంటాడుతున్న క్రమంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల తీరు ఆందోళన కలిగిస్తున్నది.

డెంగీతో ఐదో తరగతి విద్యార్థి మృతి



వడ్ల హర్షిత్ (ఫైల్)

పాపన్నపేట, ఆగస్టు 30 : డెంగీతో చికిత్స పొందుతున్న ఓ విద్యార్థి పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని చీకోడ్ గ్రామానికి చెందిన వడ్ల రాజు పెద్ద కొడుకు వడ్ల హర్షిత్ (11) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. కొన్నిరోజుల క్రితం జ్వరం రావడంతో పరీక్షలు చేయించగా డెంగీ అని నిర్ధారణ అయ్యింది. మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించగా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కూడా నయం కాకపోవడంతో గురువారం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించగా అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

డెంగీ విజృంభిస్తున్నా.. కేసులే లేవంటున్న వైద్యఆరోగ్యశాఖ

పాపన్నపేట మండలంలో ప్రజలు వైరల్ ఫీవర్‌తో మంచం పడుతున్నారు. డెంగీ, చికున్‌గున్యా విజృంభిస్తున్నాయి. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి రూ. లక్షలు ఖర్చు చేసుకుంటున్నారు. అయినా, మండల పరిధిలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాలేదని చెబుతున్నారు. చికోడ్‌లో డెంగీతో విద్యార్థి మృతి చెందడంపై జిల్లా వైద్యాధికారిని వివరణ కోరగా చిన్నారికి డెంగీ వచ్చిన మాట నిజమే అయినా.. గుండెకు సంబంధించిన వ్యాధి ఉండడంతోనే మృతిచెందినట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండలంలో ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. మరోవైపు మండల పరిధిలోని ఓ మాజీ ఎంపీటీసీ కుటుంబంలో ముగ్గురికి డెంగీ పాజిటివ్ వచ్చింది. పొడ్చన్‌పల్లిలోనూ ఒకే కుటుంబంలో ముగ్గురు డెంగీ బారినపడినట్టు తెలిసింది. జ్వర సర్వే పక్కాగా నిర్వహిస్తే వందల సంఖ్యలో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా కేసులు బయటపడతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో?

- ఆరేళ్లుగా కొత్త కార్డుల జారీ లేదు
- 3,365 అప్లికేషన్లు పెండింగ్
- సవరణలు, చేరికల కోసం 14,537 అర్జీలు
- లెక్క తేలని ప్రజాపాలన దరఖాస్తులు



మెదక్, ఆగస్టు 30: కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా రేషన్‌కార్డుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం కొత్త రేషన్‌కార్డులు జారీ చేసిన దాఖలాలు లేవు. కార్డుల కోసం 2017 మే వరకు మెదక్ జిల్లాలో 3,365 మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌ను అప్పటి మూసివేసింది. ఈ-పాస్ విధానం అమలులో అవరోధాలు రాకండా కొత్త రేషన్‌కార్డుల జారీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అప్పట్లో ప్రభుత్వం సంజాయిషీ ఇచ్చుకుంది. అప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనను కూడా అటకెక్కించింది. ఆ తర్వాత రేషన్‌కార్డులో పేర్లు, ప్రాంతం మార్పిడీ కోసం అర్జీలు స్వీకరించారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 14,537 మీ-సేవ ద్వారా ఆన్‌లైన్‌లో యంత్రాంగానికి చేరాయి. కానీ, ఆ దరఖాస్తులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి.

కార్డు లేక పథకాలకు దూరం

ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డును అర్హతగా తీసుకుంటున్న క్రమంలో కార్డు లేక అర్హులు కూడా పథకాలను పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలో రేషన్‌కార్డుల జారీ లేకపోయినప్పటికీ.. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు ఆహారభద్రతా కార్డులు అందిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. ఇందుకోసం ప్రజాపాలనలో తెల్లకాగితాలపై దరఖాస్తులు చేసుకున్నారు. కుటుంబ సభ్యుల వివరాల చేరిక కోసం కూడా అర్జీలు స్వీకరించింది. ఇందుకోసం జిల్లాలో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. కానీ, ఆ దరఖాస్తుల వివరాలు ప్రస్తుతం జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో లభ్యం కావడం లేదు. అప్పట్లో ఎంపీడీవోలు మండలాలవారీగా దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన అర్జీల వివరాలు లేకపోవడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు.

ఏటీఎం కార్డుల్లా..

అర్హులైనవారికి తెల్ల రేషన్‌కార్డులు అందించే ప్రక్రియ సెప్టెంబరు 17 నుంచి ప్రారంభించనున్నట్లు స్వయంగా సీఎం ప్రకటించడంతో నిరుపేదలలో రేషన్ కార్డుల జారీపై ఆశలు చిగురిస్తున్నాయి. రేషన్‌కార్డుల జారీకి నూతన పద్ధతిని అనుసరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ-పాస్ మిషన్‌లో స్వైప్ చేసి రేషన్ తీసుకునేలా కార్డులు రూపొందించనున్నట్లు తెలిపారు. ఏటీఎంలో కార్డు పెట్టి డబ్బులు తీసుకున్నంత సులువుగా సరుకులు తీసుకునే వీలుంటుందని పేర్కొంటున్నారు.



ప్రత్యేకాలంకరణలో వాసవీ మాత దర్శనం

సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.
-సంగారెడ్డి రూరల్

గ్రామ సమైక్య అధ్యక్షులకు డ్రెస్ కోడ్

- గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల తవ్వకానికి రూ. 431 కోట్లు
- రిటైర్డ్ ఉద్యోగులకు చికిత్స ఇప్పిస్తా
- మంత్రి పొన్నం ప్రభాకర్



మహిళా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 30 : గ్రామ సమైఖ్య అధ్యక్షులకు డ్రెస్ కోడ్ అమలు చేస్తామని, దానికి అయ్యే ఖర్చులు తానే భరిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 33 గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వ్యవసాయ ఆధారిత స్కీమ్‌లను ప్రతి మహిళా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ మహిళా సంఘాలవారు విద్యార్థులకు 86 వేల స్కూల్ యూనిఫాంను కుట్టి ఇచ్చారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పనులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. కరీంనగర్ కలెక్టర్ పమేళా సత్పతి మాట్లాడుతూ మహిళకు ఏ పథకం ఇచ్చినా వందకు వంద శాతం విజయవంతం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఫిషరిస్ డైరెక్టర్ ప్రియాంక, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో వసతి మండపం

తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆయన తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ జ్ఞాపకార్థం భక్తుల వసతి మండపానికి భూమి పూజ చేశారు. అలాగే మార్కండేయ ఆలయంలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి పద్మశాలీ కమ్యూనిటీ హాల్, ఎల్లమ్మ ఆలయ ప్రహరీ, ఎల్లమ్మ చెరువు వద్ద పార్క్, మినీ స్పోర్ట్స్ హాల్, సిద్దేశ్వర గుట్ట ఆలయ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి ముందు పట్టణంలోని సింగిల్ విండో నూతన భవనానికి పూజలు చేసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి తదితరులు ఉన్నారు.

ఎన్‌జీటీ కేసు విత్‌డ్రా చేసుకుంటే గౌరవెల్లికి నీళ్లు

గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల తవ్వకానికి రూ. 431 కోట్లు నిధులు తెచ్చానని, ఆ ప్రాజెక్టుపై ఉన్న ఎన్‌జీటీ కేసు విత్‌డ్రా చేసుకోగానే అందులో నీళ్లు నింపుతామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన హుస్నాబాద్ పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల ఆత్మీయ సన్మాన సభలో మాట్లాడారు. 45 ఎకరాలకు సంబంధించి ఎన్‌జీటీకి పోయిన శంకర్‌రెడ్డిని కేసు విత్‌డ్రా చేసుకోమని రెండు చేతులు జోడించి దండం పెట్టానన్నారు. 'ఈ విషయంపై రేపు అందరం శంకర్‌రెడ్డి ఇంటికి పోదాం, కేసు విత్‌డ్రా చేసుకోమని బతిమిలాడుదాం. ఆయన ఒప్పుకునేవరకు అక్కడే ఉందాం' అన్నారు. రిటైర్డు ఉద్యోగులకు ఆరోగ్య రీత్యా సమస్యలు ఉంటే చికిత్స ఇప్పిస్తానన్నారు. అనంతరం నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, రిటైర్డు ఉద్యోగుల నాయకులు జగ్గారావు, వీరసోమయ్య, చిట్టి దేవేందర్‌రెడ్డి, వరియోగుల సుదర్శనస్వామి, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి పాల్గొన్నారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయంలో మత్స్యశాఖపై సమీక్ష నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మనుచౌదరి, రాష్ట్ర మత్స్య శాఖ డైరెక్టర్ ప్రియాంక అలా, డిప్యూటీ డైరెక్టర్ మురళీకృష్ణ తదితరులున్నారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి, రాష్ట్ర మత్స్య శాఖ డైరెక్టర్ ప్రియాంక గౌరవెల్లి, శనిగరం ప్రాజెక్టులను సందర్శించారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్

- షీ టీమ్స్ గస్తీ పెంచాలి : ఎస్పీ రూపేష్



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 30 : జిల్లాలో మహిళలపై వేధింపులు జరిగే ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి అల్లరిమూకలు, ఆకతాయిలకు చెక్‌పెట్టాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశించారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన మహిళల భద్రతపై తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళ భద్రత కోసం సబ్‌డివిజన్లవారీగా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. షీ టీమ్ బృందాలు బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలల ప్రాంతాల్లో నిరంతరం పహారాకాస్తూ ఆకతాయిలకు చెక్ పట్టాలని సూచించారు. లోకల్ పోలీసుల సహాయంతో హాట్‌స్పాట్లను గుర్తించాలని ఆదేశించారు. భరోసా, షీ టీమ్స్ బృందాలు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, నార్కొటిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్పీ ఎస్ఐ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, సమయం, స్థల యజమానుల అనుమతి తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని నిర్దేశించారు. తగిన పత్రాలతో ఆన్‌లైన్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

చదువుకోమన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

తండ్రి మందలించాడని మనస్తాపంతో బలవన్మరణం



యశ్వంత్

నర్సాపూర్, ఆగస్టు 30: 'నిర్లక్ష్యం చేయకుండా మంచిగా చదువుకుని బాగుపడాలి..' అని తండ్రి చెప్తే.. చదువంటే ఇష్టంలేని కొడుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం చిన్నచింతకుంటకు చెందిన శైలజ, కిషన్ దంపతులకు కూతురు, కొడుకు యశ్వంత్(17) ఉన్నారు. యశ్వంత్ నర్సాపూర్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకులంలో ఇంటర్ (బైపీసీ) చదువుతున్నాడు. చదువుపై ఆసక్తి లేని యశ్వంత్ తరుచూ ఇంటికి వచ్చేవాడు. అంతకుముందు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పిస్తే చెప్పా పెట్టకుండా వచ్చేయడంతో నర్సాపూర్‌లోని గిరిజన గురుకులంలో చేర్పించారు. అక్కడ కూడా ఉండకుండా ఇంటికి వస్తుండడంతో తండ్రి కిషన్.. 'చదువుకోకుండా ఇలా వస్తే ఎలా అంటూ' కొడుకును మందలించాడు. బాగా చదువుకుని బాగుపడాలని సూచించాడు. దీంతో, మనస్తాపం చెందిన యశ్వంత్ ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెయ్యేళ్ల నాటి విగ్రహం చోరీ

వెల్చుగొండలో మాయమైన 11వ శతాబ్దానికి చెందిన మూర్తి



చోరీకి గురైన విగ్రహం (ఫైల్)

టేక్మాల్, ఆగస్టు 30 : మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెల్చుగొండ గ్రామంలోని దేవతల గుట్టపైన 11వ శతాబ్దానికి చెందిన జైన తీర్థంకరుడి విగ్రహాన్ని గుర్తుతెలియని కొందరు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వేల్చుగొండలో కాకతీయుల కాలానికి చెందిన తంబురీశ్వరాలయం ఉంది. చుట్టూ కొండల మధ్య కొలను ఉన్న ఈ ఆలయం ఉన్న ప్రదేశాన్ని దేవతల గుట్టుగా పిలుస్తుంటారు. గుట్ట పైభాగాన ఉన్న జైన తీర్థంకరుడి విగ్రహాన్ని గతంలో కొందరు చోరీ చేసేందుకు యత్నించినా వారి ప్రయత్నం ఫలించలేదు. శుక్రవారం కొందరు కాపర్లు మేకలను మేత కోసం దేవతల గుట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ బుద్ధ విగ్రహం కనిపించకపోవడంతో గ్రామస్థులకు సమాచారం అందించారు. వారు వెళ్లి చుట్టుపక్కల వెతికినా ఆనవాళ్లు లభ్యంకాలేదు. గుట్ట చుట్టుపక్కల వాహనాల టైర్ల గుర్తులు కనిపించాయి. పూజా సామగ్రి, తాళ్లు కనిపించాయి. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

● ఎస్ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట, ఆగస్టు 30: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమని చెప్పారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో చాలా వరకు నేరాలు, దోపిడీలు తగ్గాయన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ గోవింద్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో

నిందితునికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 30 : మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో నేరం రుజువుకావడంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి శుక్రవారం తీర్పునిచ్చారు. సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌లోని గండిగూడెంలో ఉండే మూడేళ్ల బాలికపై అదే కాలనీకి చెందిన అభయ్‌కుమార్ గౌతమ్ (25) 2019 ఏప్రిల్ 9న అత్యాచారానికి ఒడిగట్టాడు. అమీన్‌పూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. నిందితుడు అభయ్‌కుమార్ గౌతమ్‌కు జీవితఖైదు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 30 : ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నేరానికి నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ శుక్రవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డిలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన అర్జున్‌లాల్‌పై 2017 అక్టోబరు 12న ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన దంగర్ లఖన్‌లాల్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంగారెడ్డి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించాక నేరం రుజువు కావడంతో దంగర్ లఖన్‌లాల్ (48)కి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 30 ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మించి మోసం చేసిన ముగ్గురు సైబర్ నేరగాళ్లను సిద్దిపేట సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లాకు చెందిన కడవెర్గు రామకృష్ణ, గంగాధర అభిషేక్, జీడిగాం ఉమాకాంత్ బెజ్జంకి గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్‌కు వాట్సాప్‌లో లింక్ పంపించారు. ఆ లింక్ ఓపెన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మబలికారు. వారిని నమ్మిన రాజేంద్రప్రసాద్ ఆన్‌లైన్, గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా పది రోజుల్లో రూ.13,12,017 పంపించాడు. ఆ తర్వాత ముగ్గురిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్లు స్విచ్చాఫ్ చేశారు. మోసపోయానని గ్రహించిన రాజేంద్రప్రసాద్ జాతీయ సైబర్‌సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కాల్‌చేసి వివరాలు తెలియజేశాడు. అలాగే సిద్దిపేట సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు టెక్నాలజీ ఆధారంగా ముగ్గురు నిందితులను శుక్రవారం హైదరాబాద్ హబ్సిగూడ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి నిందితుల నుంచి రూ.50వేలు రికవరీ చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కుక్కను తప్పించబోయి..
అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

● ఒకరి పరిస్థితి విషమం.. ఇద్దరికి స్వల్ప గాయాలు
● అందరూ ఉపాధ్యాయులే

కుకునూరుపల్లి, ఆగస్టు 30 : కుక్కను తప్పించబోయి, అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఓ కారు ఢీకొన్న ఘటన కుకునూరుపల్లి శివారులో రాజీవ్ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్నది. ఈ ప్రమాదంలో ముగ్గురు ఉపాధ్యాయులకు గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. వివరాల్లోకి వెళితే.. కుకునూరుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు చైతన్య కారులో సిద్దిపేట నుంచి కుకునూరుపల్లి పాఠశాలకు విధుల నిమిత్తం వస్తున్నారు. కుకునూరుపల్లి శివారులో రాజీవ్ రహదారిపై కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించబోయి కారు అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టారు. కారు ముందు భాగంలో కూర్చున్న వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడగా ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరు టీచర్లు మల్లారెడ్డి, చైతన్య స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వారిని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గొంతులో కత్తితో పొడుచుకుని
వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● డయల్ 100కు ఫోన్ చేసి స్వయంగా తెలిపిన వృద్ధుడు

గజ్వేల్, ఆగస్టు 30 : గొంతులో కత్తి పొడుచుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్లలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా మన్నెవారి తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల రాజయ్య(65) డయల్ 100కు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకోగా కత్తితో గొంతులో పొడుచుకోవడం గమనించారు. ఒంటిపై రక్తంతో పడి ఉన్న రాజయ్యను వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వెంటనే రాజయ్య కుటుంబసభ్యులకు, బంధువులకు సమాచారాన్ని అందజేసిన పోలీసులు, వివరాలను సేకరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


నవీన్(ఫైల్)

దుబ్బాక, ఆగస్టు 30 : అప్పుల బాధతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం దుబ్బాకలో వెలుగుచూసింది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన తుమ్మ నవీన్(25)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. డబుల్ బెడ్‌రూం ఇంటిలో నివాసం ఉంటున్నాడు. దుబ్బాకలో సరైన పని దొరకకపోవడంతో నవీన్‌కు అప్పులు పెరిగిపోయాయి. చేసిన అప్పులను తీర్చలేక జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు ఇంటికి రాగా, ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో ఇతరులు సహాయంతో ధ్వంసం చేశారు. అప్పటికే నవీన్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మెదక్‌లో మరో యువకుడి బలవన్మరణం...


సందీప్ (ఫైల్)

మెదక్ అర్బన్, ఆగస్టు 30 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు కథనం ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన సందీప్(34) నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి వాళ్లను కొట్టాడు. దాంతో తల్లిదండ్రులు నర్సాపూర్‌కు వెళ్లగా.. సందీప్ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజుల నుంచి ఫోన్ చేస్తే సమాధానం రాకపోవడంతో సందీప్ తండ్రి విశ్రాంత అధ్యాపకుడైన సంగమేశ్వర్ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. పోలీసులు వెంకటేశ్వరకాలనీలోని ఇంటికి వెళ్లగా ఉరేసుకుని కనిపించాడు. ఆత్మహత్య చేసుకుని మూడు రోజులు కావడంతో మృతదేహం కుళ్లింది. సందీప్ అన్ని వివాదాల్లో జోక్యం చేసుకునేవాడు గతంలో పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు. ఇటీవల పెట్రోల్ లేదని కారును తగలపెట్టాడు. బాలింత, పసిపిల్లపై కిరోసిన్ పోసేందుకు యత్నించి జైలుకు వెళ్లి వచ్చాడు. పలు కేసుల్లో శిక్షలు అనుభవించిన సందీప్ మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పట్టణ పోలీసులు వెల్లడించారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరి మృతి


అనిల్‌కుమార్ మృతదేహం

పాపన్నపేట, ఆగస్టు 30 : ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన వనదుర్గా ప్రాజెక్టు ఎఫ్ఎన్ కెనాల్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. మెదక్‌కు చెందిన తూర్పు అనిల్‌కుమార్(30) వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం సాయంత్రం కుటుంబీకులతో కలిసి ఏడుపాయలకు వచ్చి అక్కడే ఉన్నాడు. శుక్రవారం స్నానం చేసేందుకు వన దుర్గా ప్రాజెక్టు ఎఫ్ఎన్ కెనాల్ వద్దకు వెళ్లారు. అనిల్ కుమార్ నీటిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగాడు. అక్కడే ఉన్న కుటుంబీకులు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. స్థానికులు గాలించగా ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి వచ్చి గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన
భెల్ కార్మికుడిపై కేసు

రామచంద్రాపురం, ఆగస్టు 30 : యువతి పట్ల అసభ్యంగా వ్యవరించిన బీహెచ్ఈఎల్(భెల్) కార్మికుడిపై రామచంద్రాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. భెల్ ఎల్ఐజీ కాలనీలో నివాసముంటున్న శక్తి శ్రీనిధి(20) కొండాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. రోజులాగే రాత్రి 8 గంటల సమయంలో బీహెచ్ఈఎల్ మీదుగా తన బంధువుతో ఇంటికి వెళ్తున్నది. ఈ క్రమంలో ఆమె బంధువు మూత్ర విసర్జనకు బైక్ ఆపి పక్కకు వెళ్లాడు. ఇదే సమయంలో భెల్ సెక్యూరిటీ వాహనం ఆమె వద్దకు వచ్చి నిలిచింది. అందులో నుంచి బయటకు దిగిన వ్యక్తి ఇక్కడ ఏం చేస్తున్నావ్? అంటూ దుర్భాషలకు దిగాడు. ఇంతలో ఆమె బంధువు వచ్చి ఏం జరిగిందని ప్రశ్నిస్తున్నండగా జీపులోని ముగ్గురు వ్యక్తులు కర్రలతో వారిని చితకబాదారు. అంతటితో ఆగకుండా సదరు యువతి ముఖంపై లైట్లు వేసి వీడియో చిత్రీకరిస్తూ 'నా పేరు గణేష్.. నేను భెల్ ఉద్యోగిని' ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దురుసుగా వ్యవరించారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లిన సదరు మహిళ శుక్రవారం ఉదయం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ జగన్నాథ్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

● తులం బంగారం, 60 తులాల వెండి, నగదు స్వాధీనం

వర్గల్, ఆగస్టు 30 : తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా ఎంచుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం గౌరారం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.18,000 నగదుతో పాటు, తులం బంగారం, 60 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామంలో ఈ నెల 9న తాళం వేసి ఉన్న పది ఇళ్లల్లో వరుస చోరీలకు పాల్పడి నగదుతో పాటు బంగారం వెండి వస్తువులు దోచుకెళ్లిన విషయం తెలిసిందే. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం ఉదయం మండలంలోని శాఖారం చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని విచారించారు. అంబర్‌పేట గ్రామానికి చెందిన వల్లపు రాజు(29) 20 రోజుల క్రిందట సొంత గ్రామమైన అంబర్‌పేటలో పది ఇండ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీంకరించాడు. అలాగే జూలైలో గజ్వేల్ పట్టణంలోని రెండు ఇళ్లల్లో దొంగతనం చేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బైక్‌తో పాటు తులం బంగారం, అరవై తులాల వెండి వస్తువులు, రూ.18,000 నగదును స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అలరించిన యోగాసనాలు

సిద్దిపేటలో యోగా చాంపియన్‌షిప్ పోటీలు ● పాల్గొన్న 262 మంది.. ఆకట్టుకున్న ప్రదర్శన


ఆసనాలను ప్రదర్శిస్తున్న యోగా సాధకులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 30 : సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని స్థానిక శివానుభవ మండపంలో జిల్లా యోగా చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. యోగా పోటీల్లో సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి 262 మంది పాల్గొని యోగాసనాలను ప్రదర్శించారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో బాలురు, బాలికలు, పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. సంప్రదాయ, ఆధునిక, ఆర్టిస్టిక్, రిథమిక్, పెయిర్ అంశాల వారీగా పోటీలను నిర్వహించగా యోగా సాధకులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉదయం జరిగిన ప్రారంభ సమావేశంలో సిద్దిపేట జిల్లా జేఏసీ చైర్మన్ గ్యాదరి పరమేశ్వర్, బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు రంగాచారి,యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ యోగాధ్యయన పరిషత్ సభ్యులు తోట సతీష్, మండల విద్యాధికారి యాదవరెడ్డి, పోటీ పరిశీలకులు, ప్రముఖ యోగా గురువు కరణం గణేష్ కుమార్, ఎస్‌జీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, తదితరులు పోటీలను ప్రారంభించారు. జిల్లా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయిలో గెలిస్తే జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.

మెదక్‌లో హీరో నవీన్‌చంద్ర సందడి

మెదక్ కల్చరల్, ఆగస్టు 30 : మెదక్ పట్టణం గోల్కొండ వీధి ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన లెజెండ్ అవుట్ ఫిట్టర్స్ వస్త్ర షోరూమ్‌ని ప్రముఖ తెలుగు నటుడు, హీరో నవీన్‌చంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి మెదక్‌కి వచ్చానని, ఇక్కడి ప్రజలు తనను ఎంతో ప్రేమతో ఆదరించడం సంతోషం కలిగిస్తుందన్నారు. ఎంతో కాలంగా తన ఆత్మీయ స్నేహితులైన రాజు, శ్రీనివాస్ లెజెండ్ అవుట్ ఫిట్టర్‌షాప్‌ని ఏర్పాటు చేశారని తెలిపారు. లెజెండ్ అవుట్ ఫిట్టర్ ఎండీ రాజు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తమ మొదటి బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని, మెదక్ యువతకి చిన్నారుల కోసం ఇక్కడ మరో బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సంస్థ ప్రతినిధులు బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హీరో నవీన్‌చంద్ర

టెన్నికాయిట్ ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవి

సిద్దిపేట టౌన్, ఆగస్టు 30 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో టెన్నికాయిట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ అండర్ 14 బాలబాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవి, హ్యాండ్ బాల్ కోచ్ తుమ్మల కనకయ్య, వెయిట్ లిఫ్టింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో తన్విక (బెజ్జంకి), లక్ష్మీవైష్ణవి(సిద్దిపేట), నివేదిత(బెజ్జంకి), అర్చన(సిద్దిపేట), కీర్తి(కుకునూరుపల్లి), బాలుర విభాగంలో దినేష్(సిద్దిపేట), చందు(సిద్దిపేట), చరణ్(సిద్దిపేట), రక్షిత్‌ప్రభ(హుస్నాబాద్), శ్రీనాథ్(హుస్నాబాద్) ఎంపికైనట్లు నిర్వహకులు తెలిపారు.

ఎస్టీ, ఎస్సీలను అక్రమ కేసుల్లో ఇరికిస్తే సహించేది లేదు

● న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు శాఖలు పనిచేయాలి
● కేసులను త్వరితగతిన పరిష్కరించాలి
● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 30 : ఎస్సీ, ఎస్టీలను అనవసరంగా అక్రమ కేసుల్లో ఇరికిస్తే సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులు, కుల సంఘాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు శాఖలు పనిచేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, జిల్లా స్థాయి అధికారులు గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను తరచూ తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే అధికారులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళితులకు ఎక్కడ సమస్యలు ఎదురైతే కమిషన్ అక్కడికి వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రకాల కేసులను సెప్టెంబర్ నెలాఖరులో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయన పోలీసులను ఆదేశించారు. నెలరోజుకోసారి ఎస్సీ, ఎస్టీ సమస్యలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీలకు బక్కి వెంకటయ్య సూచించారు.



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

విధిగా అధికారుల తనిఖీలు : కలెక్టర్ క్రాంతి

విద్యార్థులకు మంచి విద్య, భోజనం అందజేసేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను అధికారులు విధిగా తనిఖీ చేయాలని, పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. భూ సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో సివిల్ డే కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్యను టీఎన్‌జీవో నాయకులు, దళిత, గిరిజన నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలావేవి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జగదీష్, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసే వరకు రాజీలేని పోరాటం

● టీజీఈజేఏసీ చైర్మన్ జావేద్‌అలీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 : సీపీఎస్‌ను రద్దు చేసే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని టీజీఈజేఏసీ చైర్మన్ జావేద్‌అలీ తెలిపారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో శుక్రవారం పెన్షన్ విద్రోహ దినం(సెప్టెంబరు 1)న పురస్కరించుకొని సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జావేద్‌అలీ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. కో చైర్మన్ వైద్యనాథ్ మాట్లాడుతూ సెప్టెంబరు 1న నిర్వహించే కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ 1న ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు జరిగే ర్యాలీలో ఉద్యోగులు ఐక్యతగా పాల్గొని మరోసారి ఆవశ్యకత తెలియజేయాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ మాట్లాడుతూ ఉద్యోగులందరూ సంఘటితంగా పోరాడి సీపీఎస్ విధానాన్ని పారదోలే వరకు పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు వేణుగోపాలస్వామి, శ్రీనివాస్‌రాథోడ్, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, అంజయ్య, మురళీధర్, మల్లేశం తదితరలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న భారీ ర్యాలీ : టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్ అర్బన్, ఆగస్టు 30: నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సంఘ భవన్‌లో ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెన్షన్ విద్రోహదిన సన్నాహక సమావేశంలో భాగస్వామ్య సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ.. ఆదివారం ఉదయం 10 గంటలకు టీఎన్జీవో భవన్ నుంచి స్థానిక రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ట్రెసా, తపస్ టీపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్, టీటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌గౌడ్, ఎల్లం, సంగయ్య, రాజ్‌గోపాల్‌గౌడ్, పద్మరావు, శివయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్‌చంద్ర, టీపీటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు యాదగిరి, హీరాలాల్, టీఎన్జీవో నాయకులు ఫణిరాజ్, ఫజులొద్దీన్, రిటైర్డ్ ఎంప్లాయీస్ మనోహర్, మధు తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డిలో సన్నాహక సమావేశంలో పాల్గొన్న టీజీఈజేఏసీ నాయకులు, మెదక్‌లో అభివాదం తెలుపుతున్న ఐక్య కార్యాచరణ సమితి ఉద్యోగులు

పదవీవిరమణ రోజే
పెన్షన్ ఆర్డర్లు

● ప్రయాస్ కార్యక్రమం ద్వారా మెరుగైన సేవలు
● భవిష్య నిధి ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు, ఆగస్టు 30: పదవీవిరమణ చేసిన రోజే పీఎఫ్ పెన్షన్ పత్రాలను అందజేస్తున్నామని భవిష్యనిధి పటాన్‌చెరు ప్రాంతీయ కార్యాలయం కమిషనర్ విశాల్‌అగర్వాల్ పేర్కొన్నారు. వివిధ శాఖల్లో పనిచేసి శుక్రవారం పదవీవిమరణ చేసిన 28 మంది పీఎఫ్ ఖాతాదారులకు కార్యాలయంలోనే పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు సత్వర సేవలు అందించేందుకు ప్రయాస్ అనే వినూత్న కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. పదవీ విమరణ చేసిన రోజే పూర్తి పీఎఫ్ సెటిల్‌మెంట్‌తో పాటు పెన్షన్ పత్రాలను సిద్ధం చేసి అందజేస్తున్నామన్నారు. ఖాతాదారులు పలుమార్లు పీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరగనవసరం లేకుండా వారి ముంగిట్లోకే సేవలను తీసుకెళుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్-2, శ్రీదేవి, అకౌంట్ అధికారి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పన్నులు తగ్గించే వరకు
పోరాటం ఆగదు

● తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్


మాట్లాడుతున్న రాఘవేందర్‌గౌడ్

తూప్రాన్, ఆగస్టు 30: తూప్రాన్ మున్సిపాలిటీలో రాష్ట్రంలో ఎక్కడ లేనంతగా అడ్డగోలుగా పెంచిన ఇంటి పన్నులను తగ్గించే వరకు పోరాటం ఆగదని మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని, అవసరమైతే బంద్‌లు, దీక్షలు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం తూప్రాన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచిన పన్నులు తగ్గించే వరకు పన్ను కట్టవద్దని ప్రజలకు సూచించారు. ఇంటి పన్నుల పెంపుపై తన హయాంలో నిర్ణయం తీసుకున్నట్లు చేసిన ఆరోపణలు అబద్ధమన్నారు. తీర్మానం చేసినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానన్నారు. ఇంటి పన్ను పెంపును ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. వ్యక్తిగత దూషణలపై పరువు నష్టం దావా వేస్తానంటు హెచ్చరించారు. మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ ఎవరని? భార్యభర్త కూర్చొని రివ్యూ మీటింగ్ చేయడమేంటని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సత్యలింగం, బొంది వెంకట్‌గౌడ్, సత్తార్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పొట్లపల్లి పారిశుధ్య కార్మికుడికి
జాతీయ పురస్కారం


విజయవాడలో పురస్కారాన్ని అందుకుంటున్న లక్ష్మణ్

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 30: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు లక్ష్మణ్‌కు జాతీయ పురస్కారం లభించింది. తెలుగుభాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ టీచర్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 29న విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో పురస్కారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పొట్లపల్లిలో లక్ష్మణ్ పంచాయతీ కార్మికుడిగా అంకిత భావంతో సేవలందించడాన్ని గుర్తించి గిడుగు రామమూర్తి సేవారత్న జాతీయ పురస్కారాన్ని అక్కడి స్థానిక ఎమ్మెల్యే నలిమెల రామకృష్ణారెడ్డి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, టీచర్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడునాగేశ్వర్ అందజేశారు. లక్ష్మణ్‌కు జాతీయ పురస్కారం రావడంతో పట్ల శాలీవాహన సంఘం అధ్యక్షుడు కానుగుల మోహన్, మాజీ ఎంపీపీ దేవసాని నిర్మల, మాజీ సర్పంచ్ దేవసాని సుశీల, గ్రామస్థులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తంచేశారు.



రూ.5 నాణేలతో అమ్మవారి చిత్రం

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవి రూపాన్ని రూ.5 నాణేలతో గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు ఆవిష్కరించారు. - గజ్వేల్

వెల్టూర్ ఉపాధ్యాయుడికి
గురుబ్రహ్మ బంగారు నంది అవార్డు


మల్లికార్జున్‌గౌడ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 : విద్యారంగంలో చేసిన సేవలకుగాను సదాశివపేట మండలం వెల్టూర్ ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌గౌడ్ గురుబ్రహ్మ బంగారు నంది అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 8న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో మల్లికార్జున్‌గౌడ్ అవార్డును అందుకోనున్నారు. అవార్డుకు ఎంపిక చేసినందుకుగాను వల్లూరు ఫౌండేషన్‌కు మల్లికార్జున్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అంతరిక్షయానంపై అవగాహన

వెల్దుర్తి, ఆగస్టు 30 : వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతరిక్షయానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, ఇస్రో శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఎంఈవో యాదగిరి హాజరై మాట్లాడారు. దేశ నిర్మాణం తరగతి గదుల్లోనే మొదలవుతుందని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని వారు సూచించారు. ఒకప్పుడు అంతరిక్షయానంలో అమెరికా, చైనా, రష్యా వంటి దేశాలపై ఆధారపడేదని, ఇప్పుడు ఇండియా ముందు ఉండడం అందరికీ ఎంతో గర్వకారణమన్నారు. అంతకముందు ఇస్రో శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చంద్రయాన్, గగన్‌యాన్, మంగళ్‌యాన్, ఇస్రో రాకెట్ ప్రయోగాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ఇస్రో బస్సులో అంతరిక్ష ప్రయోగాల వివిధ నమూనాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంతరిక్ష ప్రయోగాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

బ్యాంకు రుణాలతో మహిళలు అభివృద్ధి చెందాలి


చిన్నశంకరంపేట ఐకేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ

చిన్నశంకరంపేట, ఆగస్టు 30: బ్యాంకు రుణాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీవో పీడీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి డీఆర్డీవో పీడీ పాల్గొని మహిళలకు ఉపాధి కల్పించేవిధంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ, సీసీలు రాజు, యశోద, కిషన్, నాగరాజు, వీవోఏలు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

● ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలను పెంచాలి

ఉపాధి హామీ పనుల ద్వారా ప్రతీ గ్రామంలోని పండ్ల తోటలను పెంచేందుకు కృషి చేయాలని డీఆర్డీవో శ్రీనివాస్ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందికి రివ్యూ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో 50 ఎకరాల పండ్ల తోటలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనారాయణ, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

● చేగుంటలో షాపుల పరిశీలన

చేగుంట ,ఆగస్టు 30: మండల కేంద్రంలో మహిళా శక్తి ఆంత్రపెన్యూర్ కింద మంజూరైన రుణాలతో ఏర్పాటు చేసిన షాపులను శుక్రవారం మెదక్ డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు సందర్శించి పరిశీలించారు. చేగుంటలో పండ్ల దుకాణాలు, చెప్పుల షాపు, కిరాణం షాపులను నడుపుతున్న మహిళలతో మాట్లాడి వ్యాపార విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రుణాలు పొందినవారు దుర్వినియోగం కాకుండా వ్యాపార అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేగుంట ఏపీఎం లక్ష్మి నర్సమ్మ, సీసీ మమత, వీవోఏలు తదితరులు ఉన్నారు.

గడ్డపోతారంలో పరిశ్రమలకు పీసీబీ అధికారుల నోటీసులు

జిన్నారం, ఆగస్టు 30: గడ్డపోతారంలోని పలు పరిశ్రమలకు పీసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల కాలుష్య జలాలు తాగి పాడి గేదెలు మృతి చెందగా.. స్థానికుల ఫిర్యాదుతో శుక్రవారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు సెప్టెంబరు 3న నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని నోటీసులు అందజేశారు. కాగా కాలుష్యాన్ని బహిరంగ ప్రాంతాలకు వదిలివేశారని కాజీపల్లి వాసుల ఫిర్యాదుతో పీసీబీ సనత్‌నగర్ కార్యాలయంలో శుక్రవారం టాస్క్‌ఫోర్సు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల కాలుష్యంపై ఫిర్యాదు చేసిన కాజీపల్లివాసుల నుంచి అధికారులు సమాచారం సేకరించారు.

ముమ్మరంగా రుణమాఫీ కాని రైతుకుటుంబాల నిర్ధారణ

కల్హేర్, ఆగస్టు 30: బ్యాంకులో పంట రుణం ఉండి రేషన్ కార్డు లేక రుణమాఫీ వర్తించని రైతుల వివరాల కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం కల్హేర్ మండలంలోని రాపర్తి గ్రామంలో రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని సాంకేతి కారణాల వలన రుణాలు మాఫీ కాలేదని, దీని కోసం కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కుటుంబ నిర్ధారణ కోసం రుణమాఫీ యాప్‌లో కుటుంబ సభ్యుల గ్రూపింగ్ నమోదు చేపట్టినట్లు తెలిపారు. ఇతర కారణాల చేత రుణమాఫీ వర్తించని రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి కారణాలు తెలుసుకోవాలని డీఏవో శివప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సంతోషకుమారి, మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు. అంతకముందు మండల కేంద్రమైన కల్హేర్‌లో నిర్వహించిన గ్రామసభలో మండల ఇన్‌చార్జ్ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

● జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి,


కల్హేర్: రాపర్తిలో రైతులతో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

రంజోల్, గోవిందాపూర్, మొగుడంపల్లి తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న రుణమాఫీ కుటుంబనిర్దారణ కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 5,604 మంది రైతు కుటుంబాలను నిర్ధారించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య, ఏఈవో ప్రదీప్, వీరేందర్, మనోహర్, రాజు, శ్రీనివాస్, ఆయేషాఖనీజ్, రైతులు పాల్గొన్నారు.

●నర్సాపూర్: రుణమాఫీ కాని రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని శుక్రవారం నర్సాపూర్


జహీరాబాద్: రంజోల్‌లో వివరాల నమోదుపై రైతులకు సలహాలు ఇస్తున్న ఏడీఏ భిక్షపతి

పట్టణంలో వ్యవసాయశాఖ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ సంధ్యతో పాటు ఏవో దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట: మండలంలో రుణమాఫీ వర్తించని రైతు కుటుంబాల నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటికీ తరుగుతూ వివరాలను నమోదు చేసినట్టు ఏవో ఆకిరి నాగంకృష్ణ తెలిపారు. అదేవిధంగా అయా రైతు కుటుంబాలకు కుటుంబ నిర్ధారణ పత్రాన్ని కూడా అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండలవ్యవసాయ విస్తీర్ణ అధికారి వినీత్, రైతులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూసేకరణ

● రైతులతో సమావేశమైన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

తూప్రాన్, ఆగస్టు 30: మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామంలో పారిశ్రామిక పార్కు స్థాపన కోసం భూసేకరణకు పరిహారం చెల్లింపుపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో తూప్రాన్ తహసీల్దారు విజయలక్ష్మితో కలిసి గుండ్రెడ్డిపల్లి రైతులతో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సమావేశమయ్యారు. తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేసేందుకు 45 ఎకరాల భూసేకరణ చేసేందుకు నిర్ణయించారు. పరిహారం చెల్లింపు చేసేందుకు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో రైతులు సమావేశమయ్యారు. ఇందులో 25.10 ఎకరాల భూమి


తూప్రాన్ మండల రైతులతో సమావేశమైన అదనపు కలెక్టర్

రైతులకు అసైన్ చేయడంతో పరిహారం విషయంలో చర్చలు జరిపారు. న్యాయమైన పరిహారంగా ఎకరాకు రూ. 25 లక్షలు చెల్లించాలని రైతులు కోరగా, కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానంటూ వెంకటేశ్వర్లు వివరించారు. ప్రభుత్వం నుంచి రావలసిన ప్యాకేజీ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని వివరించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితతరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించిన డీఎల్పీవో


పెద్దశంకరంపేటలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సురేష్‌బాబు

పెద్దశంకరంపేట, ఆగస్టు 30: స్థానిక సంస్థల ఎన్నికల కోసం జరుగుతున్నఓటరు జాబితాను శుక్రవారం పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో మెదక్ డీఎల్పీవో సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భగా పంచాయతీ కార్యదర్శులకు ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సవరణ పూర్తి చేసి సెప్టెంబరు 6న అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల పురస్కార అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30: జిల్లాలో బాల పురస్కార అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సు కలిగి ప్రతిభావంతులైన బాలలు, పిల్లల రక్షణ సంరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సెప్టెంబరు 3వ తేదీలోపు కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేస్తా: ఎమ్మెల్యే సునితారెడ్డి

నర్సాపూర్,ఆగస్టు 30: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండి విద్యనభ్యసించే విద్యార్థులకు మెను ప్రకారం పౌష్టికాహారాన్ని అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతిగృహాలలో వార్డెన్లు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ విద్యార్థుల బాగోగులను పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. వసతిగృహాల్లో అపరిశుభ్రతకు తావులేకుండా చూడాలన్నారు. తాను కూడా వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తానని హెచ్చరించారు. వసతిగృహాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నాగరాజుగౌడ్, ఏఎస్‌డబ్ల్యూవో లింగేశ్వర్, టీఎస్టీవో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ వసతిగృహాల వార్డెన్లు ఉన్నారు.

విలేకరి ముసుగులో రాజకీయాలేంటి?

● బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

హత్నూర, ఆగస్టు 30: విలేకరి ముసుగులో రాజకీయం చేయడం సరి కాదని, కార్యక్రమాల్లో ఏమైనా ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరిగితే పత్రిక ద్వారా వెలుగులోకి తేవాలని బీఆర్ఎస్ నాయకులు నవాల్ విసిరారు. శుక్రవారం మంగాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గురువారం హత్నూరలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఓ విలేకరి రాజకీయాలు చేస్తూ స్టేజీ పైన ఉన్న బీఆర్ఎస్ నాయకులపై దురుసుగా ప్రవర్తించి రాష్ట్ర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డితో పాటు మరికొందరు నాయకులను దూషించాడని ఆరోపించారు. ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగితే ఫొటోలు తీసి వార్త రాయాలి కానీ, వృత్తి ధర్మాన్ని మరిచి వ్యవహరించడం సరికాదన్నారు. అనవసరంగా ఆగడాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోబోమని వారు స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, చెన్న నర్సింహులు, దామోదర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేష్ అర్జున్, శంకర్, రాజు, వీరేందర్, పోచయ్య, ఆశయ్య పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై దృష్టి సారించాలి

నిజాంపేట, ఆగస్టు 30: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చల్మెడ గ్రామంలో శుక్రవారం శాంతికమిటీ సమావేశం ఏర్పాటు చేసి పలువురు కుల, మత పెద్దలు, నిర్వాహకులకు మండపాల ఏర్పాట్లపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ముఖ్యంగా వినాయక మండపాల నిర్వాహకులు శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులతో అనుమతులు తీసుకొని పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

గాయపడిన రైతు చికిత్స పొందుతూ మృతి


సుధీర్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 30: వ్యవసాయం పొలం వద్ద ప్రమాదవశాత్తు కింద పడిన రైతు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకట్రావ్‌పేట్‌లో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి రమేష్ (44) గత 7వ తేదీన ఉదయం సోదరుడైన గౌరయ్యతో కలసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో రమేష్ కాలికి రాయి తగలి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్ ఏరియా అసుపత్రికి తీసుకెళ్లి, మెరుగైన చికిత్స కోసం గాంధీ అసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంద్రపురి కాలనీలో మూడిళ్లలో చోరీ

● బంగారం, వెండి అభరణాలతో పాటు నగదు అపహరణ

మెదక్ అర్బన్, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని ఇంద్రపురి కాలనీలో గురువారం రాత్రి మూడు ఇళ్లలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీలో నివాసముండే రేఖ ఇంటికి తాళం వేసి చిన్నఘణపూర్‌లోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. దొంగలు తాళం పగలగొట్టి బెడ్‌రూంలోని బీరువాను ధ్వంసం చేసి అందులోని 2 తులాల బంగారు గొలుసు, వెండి చిక్కలను ఎత్తుకెళ్లారు. అదే కాలనీలో నివాసముండే హన్మంత్‌రెడ్డి ఇంట్లోంచి రూ. 8 వేలు అపహరించుకుపోయారు. అక్కడి నుంచి కొద్ది దూరంలో సాయికిరణ్ ఇంటి ముందు పార్కింగ్ చేసిన టీఎస్ 35సీ 5553 నంబర్ గల పల్సర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. బాధితులు శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా రాత్రి వేళల్లో గస్తీలు పెంచి దొంగతనాల నివారణ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ అంజనేయులు పోలీసులను కోరారు.

పటేల్‌గూడ-మెహదీపట్నం బస్సు సర్వీస్‌లు ప్రారంభం

పటాన్‌చెరు, ఆగస్టు 30: అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ నుంచి నేరుగా మెహదీపట్నం వరకు రెండు సిటీ బస్సులను శుక్రవారం ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటశ్రీనివాస్‌గౌడ్ బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ బస్సు పటేల్‌గూడా బీహెచ్‌ఈఎల్ మెట్రోకాలనీ నుంచి ప్రారంభమై బీరంగూడా, అశోక్‌నగర్, శేరిలింగంపల్లి, ఆల్విన్‌క్రాస్‌రోడ్డు, కొండాపూర్, కొత్తగూడ, హైటెక్‌సిటీ, రాయదుర్గంమెట్రోస్టేషన్ మీదుగా టోలీచౌకి, మెహదీపట్నం వరకు బస్సు ప్రయాణిస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. త్వరలో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామన్నారు.

గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేయాలి


కవేలిలో నీటి పరీక్ష చేయిస్తున్న జిల్లా మత్స్యశాఖ శాఖ అధికారి సుధాకర్

కోహీర్, ఆగస్టు 30: గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మత్స్యశాఖశాఖ అధికారి సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కవేలి గ్రామాన్ని సందర్శించిన జిల్లా మత్స్యశాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ వర్షపు నీరు ఇళ్ల పరిసరాల్లో నిలబడకుండా చూసుకోవాలన్నారు చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకూడదని సూచించారు. కవేలి గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి పలువురికి వ్యక్తిగత పరిశుభ్రతపైన అవగాహన కల్పించారు అంతేకాకుండా పలువురు ఇండ్ల వద్ద ఆయన నీటి పరీక్ష చేయించి నీటి నాణ్యతను తెలుసుకున్నారు. వెంట పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ అంగన్‌వాడి టీచర్లు, అయాలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

నార్సింగిలో సఖీ కేంద్రం అధ్వర్యంలో అవగాహన

చేగుంట, ఆగస్టు 30: మెదక్ సఖీ కేంద్రం ఆధ్వర్యంలో నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం సఖీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖీ కేంద్రం బృందం సభ్యులు కళావతి మాట్లాడుతూ గృహహింస, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాల కార్మికుల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో టోల్ ఫ్రీ నెంబర్ 181, 112, 1098,1930 లను సంప్రదించాలని సుచించారు. కార్యక్రమంలో పారామెడికల్ మంజుల, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

సీఎం సహాయ నిధితో నిరుపేదలకు ప్రయోజనం


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్, ఆగస్టు 30: సీఎం సహాయనిధి పథకంతో నిరుపేదలకు మరింత ప్రయోజనం చేకూరనుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటిమాణిక్ రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో న్యాల్‌కల్, తదితర మండలాలకు చెందిన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

టీపీటీఎఫ్ నుంచి పీఆర్టీయూలో పలువురి చేరిక

నారాయణఖేడ్,ఆగస్టు 30: డివిజన్‌కు చెందిన టీపీటీఎఫ్ ప్రధాన నాయకులు శుక్రవారం పీఆర్టీయూకు చెందిన ఎమ్మెల్సీ రఘోత్వంరెడ్డి, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మయ్య ఆధ్వర్యంలో పీఆర్టీయూటీఎస్‌లో చేరారు. చేరిన వారిలో టీపీటీఎఫ్‌జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా కార్యదర్శులు దుర్గం నర్సింహులు, ఎస్.రమేష్, మనూరు మండలశాఖ అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, ఖేడ్ ఉపాధ్యక్షుడు బజ్జం శంకర్, పండరి, కంగ్టి మండల మాజీ అధ్యక్షుడు అంబాజీ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: టీపీటీఎఫ్

మనోహరాబాద్, ఆగస్టు 30: టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మనోహరాబాద్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు చేయించారు. మండలంలోని మనోహరాబాద్, కాళ్లకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు టీపీటీఎఫ్‌లో సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రకౌన్సిల్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలి

మనూరు, ఆగస్టు 30: సభ్యత్వనమోదు కార్యక్రమంలో యువకులు, బీజేపీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం గల రాజకీయపార్టీ బీజేపీ అనిగుర్తుచేశారు. శుక్రవారం మనూరులో బీజేపీ మండలకార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిరాం మాట్లాడుతూ సెప్టెంబరు 2 నుండి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని, ప్రతీబూత్ నుంచి 200ల వరకు సభ్యత్వాలు అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఖేడ్‌పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, బీజేపీనాయకులు పాల్గొన్నారు.

● మనోహరాబాద్, ఆగస్టు 30: మండల కేంద్రంలో కార్యశీల మండల సమావేశం మండలాధ్యక్షుడు నరేందర్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్ గౌడ్, బిజెవైఎమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, ఐలయ్య, నరేష్‌గౌడ్, లక్ష్మణ్ సింగ్ ఠాకూర్, కృష్ణ రమేష్, నాగరాజు, వేణుగెపాల్‌రెడ్డి, ప్రవీణ్, దుర్గేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● మెదక్ అర్బన్, ఆగస్టు 30: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పండుగలా నిర్వహించాలని బీజేపీ అధికార ప్రతినిధి నందారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

కోల్‌కతా హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి



సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 30 : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు జ్యోతి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన సమైఖ్య సభ్యులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమలో డీపీఎంలు రవీందర్, జయశ్రీ, మల్లేశం, శ్రీనివాస్, శ్రీదేవి, సమత, శివలక్ష్మీ, వెంకట్, ఏపీఎంలు పాల్గొన్నారు.

నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణారావు

నర్సాపూర్,ఆగస్టు 30: నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జైతురాం నాయక్ స్థానంలో రామకృష్ణారావు బదిలీపై రానున్నారు. ప్రస్తుత కమిషనర్ జైతురాంనాయక్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో అయనను హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ, ఆయన స్థానికంలో జీహెచ్ఎంసీ నుంచి రామకృష్ణారావు బదిలీపై రానున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పటాన్‌చెరు, ఆగస్టు 30: అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకట్ రాంరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్.హోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11గంటల వరకు కేజీఆర్, సాయివిల్లాస్, గ్రీన్ విల్లాస్, ఎస్ఎస్. హోమ్స్, భరత్‌నగర్ కాలనీలలో, బొల్లారం నుంచి వచ్చే 11కేవీ పవన్ ఫీడర్ పరిధిలో 11నుంచి 11-30వరకు గ్రైడ్ పార్క్, ఎంపైర్ మీడోస్, అమీన్ పూర్ ఫీడర్ పరిధిలో 10నుంచి 11-30వరకు, సురక్షా, సాయిరాంనగర్, నరేంద్రకాలనీ, పీఎస్ఆర్.కాలనీ, సాయి అంబిక, రాజేశ్వరి, ఐలాపూర్‌తండా, భూదాన్ కాలనీలలో, వెదిరి ఫీడర్ పరిధిలో 1-30నుంచి 3గంటల వరకు అమీన్ పూర్ గ్రామం, చక్రపురి, శ్రీవాణినగర్, ఎంపైర్‌మీడోస్, అంబికా ఫేజ్.1, 2 కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

● రామచంద్రాపురం: తెల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎంఐజీ ఫేజ్-1, 2, అన్నమయ్య ఎన్‌క్లేవ్, ఇంద్రానగర్, తెల్లాపూర్, కొమురంభీం కాలనీ, అంబేడ్కర్ కాలనీ, జ్యోతిరావు పూలే కాలనీ, మే ఫేర్, బోన్‌సాయి, వాసుదేవ, ఆదిత్య, మాక్‌సాసైటీ కాలనీల్లో శనివారం మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బాలకృష్ణ తెలిపారు. ఎంఐజీ 33/11కేవీ మరమ్మతుల దృష్ట్యా చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ చెప్పారు.

నేడు సహారా ఆస్పత్రిలో న్యూరో, గైనిక్ ఉచిత శిబిరం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30: సంగారెడ్డి జిల్లా కోర్టు సమీపంలోని సహారా ఇన్‌క్లూసివ్ ఆస్పత్రిలో ఈ నెల 31 న న్యూరో, గైనకాలజీ ఆరోగ్య సమస్యలకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎం.డీ. మఠం శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అపాయింట్‌మెంట్ కోసం 9949079792 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

జిన్నారం, ఆగస్టు 30: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు.శుక్రవారం మున్సిపాలిటీలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ నిర్మలారెడ్డి, వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించారు.

కాజీపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

జిన్నారం, ఆగస్టు 30: కాజీపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్‌వీఎం ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 200మందికి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకుడు రమాకాంత్ తెలిపారు.

పలు మండలాల్లో పౌరహక్కుల దినోత్సవం

కోహీర్/మునిపల్లి/కొండాపూర్, ఆగస్టు 30: పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోహీర్, మునిపల్లి, కొండాపూర్ మండలాల్లో అధికారులు ఆయా గ్రామస్తులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కోహీర్ మండలం కొత్తూరు(డి)గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ కిష్టయ్య గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. మునిపలి మండల పరిధిలోని పోల్కంపల్లిలో రెవెన్యూ అధికారులు ప్రజలకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ కృపానందం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తే చర్యలు తప్పవన్నారు. కొండాపూర్ మండలం తొగర్‌పల్లి ఎస్సీ కాలనీల్లో తహసీల్దార్ అనిత, ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నవేణి, ఏఎస్ఐ సూర్యనాయక్ ప్రజలకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సమ్మ, పోలీసులు, గ్రామస్థులు ఉన్నారు.

విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలి: ఖేడ్ ఎమ్మెల్యే


ఖేడ్‌లో వైద్యశాఖ సీహెచ్‌వో ఉద్యోగ విరమణ సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 30: నియోజకవర్గంలోని హాస్టళ్లను తాము అకస్మికంగా తనిఖీ చేస్తామని, మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గస్థాయి హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను సంక్షేమాధికారులు సొంత బిడ్డల్లా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలన్నారు. నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనాలను తొలగించి, నూతనభవనాలను నిర్మించడానికి అవసరమైన చోట ప్రహరీలు నిర్మించడానికి కూడా ప్రతిపాదనలు పెట్టిస్తామన్నారు. హాస్టళ్లలో నీటి సమస్య నెలకొన్న విషయాన్ని సంక్షేమాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో, ఆయన వెంటనే హాస్టళ్లలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని, మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూవో చంద శ్రీనివాస్, ఎంపీడీవోలు శ్రీనివాస్‌రెడ్డి, వివేకానంద్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సేవాలాల్ సంఘంరాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ


ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో న్యాయవాది బోజిరెడ్డి, సేవాలాల్ సంఘంరాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, జ్ఞానేశ్వర్‌పటేల్, రాజుసేట్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పదు

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని, ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్న సమయంలో అందించిన సేవలు తీపి గుర్తులుగా ఉంటాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ వైద్యశాఖలో సీహెచ్‌వోగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వజ్రమణి, శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సంధ్యారాణి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, ఖేడ్‌డివిజన్‌పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే చింతా

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 30: కంది మండలం కలవలంపేటలోని దుర్గాభవానిమాత ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వెంట సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను శుక్రవారం విద్యుత్ శాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనాథ్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

● పలు మండలాల్లో ఎస్‌జీఎఫ్ క్రీడలు

పాపన్నపేట, ఆగస్టు 30: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ వెల్లడించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి ఆటల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, అండర్-16 బాలికలకు ఖో ఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృడత్వానికి, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. ఓటమి ద్వారా పొందిన అనుభవం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి , పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, సురేందర్‌గౌడ్, అంజా గౌడ్, వీరేశం, పద్మ, శ్రీనివాసరావు, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భవాని, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నర్సాపూర్: చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం గిరిజన గురుకులం మైదానంలో (ఎస్‌జీఎఫ్) మండలస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ కొంత సమయం మైదానంలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, గురుకుల ప్రిన్సిపాల్ బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాపన్నపేటలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

● చిన్నశంకరంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో పోటీపడ్డారు.

● నారాయణఖేడ్: విద్యార్థులు క్రీడల్లో క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన నిజాంపేటలో ఎస్‌జీఎఫ్ క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లోనూ రాణించాలన్నారు. సందర్భంగా నిజాంపేట పాఠశాల హెచ్‌ఎం. పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరడంతో, నిజాంపేటకు చెందిన వ్యాపారి అందుకోసం రూ.50 వేలు, మాజీఎంపీపీ మల్లేశం రూ.10 వేలు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు.

● హత్నూర: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో


కోహీర్: దిగ్వాల్‌లో కబడ్డీ క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో

దోహదపడతాయని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట నర్సింహులు,విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కోహీర్: మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల జీఎంఆర్ ప్రైవేట్ పాఠశాల ఆవరణంలో మండలస్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఎంఈవో శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. 30వ తేదీన బాలురకు, 31న బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● నాగల్‌గిద్ద: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ క్రీడలను స్థానిక అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. అండర్-14, అండర్-16 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఎస్ఐ సాయిలు, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రావు, శంకర్, హీరామన్, కాంగ్రెస్‌నాయకులు ఉన్నారు.